క్లుప్తంగా

పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



దామెర : మండలంలోని ల్యాదెళ్ల గ్రామంలో చేపట్టిన పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పసుపు, కుంకుమ, టెంకాయలు సమర్పించి సంప్రదాయ రీతితో భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శంకర్, రెడ్ క్రాస్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, సర్పంచ్ కుక్క శ్రావణ్య అనిల్, ఉపసర్పంచ్ మాదాసు కీర్తి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్‌లు పెసరు మహిపాల్‌రెడ్డి, హింగె శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కన్నెబోయిన రమేష్, పిట్టల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.50 వేల సాయం



శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన మాస్కుల కుమారస్వామి కుటుంబానికి అతడి చిన్ననాటి మిత్రులు రూ.50 వేల నగదు సాయం అందించి ఔదార్యం చాటుకున్నారు. కుమారస్వామి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఈ క్రమంలో కుమారస్వామితోపాటు 1993–94 విద్యాసంవత్సరంలో నేరేడుపల్లిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి స్నేహితులు స్పందించారు. సోమవారం నాడు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంతా కలిసి రూ.50 వేల నగదును కుమారస్వామి కుటుంబానికి అందజేశారు. తమ మిత్రుడి కుటుంబానికి ఎళ్లవేళల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కుమారస్వామి టెన్త్ మిత్రులు ప్రశాంత్, విద్యాసాగర్, లింగానాయక్, మంజుల, రాజు, రాజేందర్, రఘుపతి, దేవేంద్రచారి, శ్రీనివాస్, రజనీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల ధర్నా



గీసుకొండ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వరంగల్ నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పని చేస్తున్న స్టాఫ్‌నర్సు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, అకౌంటెంట్, సపోర్టింగ్ స్టాఫ్, తదితర కేడర్లకు చెందిన ఉద్యోగుల సర్వీసులను రెగ్యులర్ చేయాలంటూ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఎన్‌హెచ్‌ఎం ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఐదు రోజుల నుంచి చేస్తున్న సమ్మెలో భాగంగా ధర్నా చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రామా రాజేశ్ ఖన్నా, నాయకులు శ్రీబాద్రి వేణు, బండి రాజేశ్, మార్క రాజేశ్, అర్చన, జ్యోత్స్న, రుబీనా, కళ్యాణి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

పట్టాపాస్ పుస్తకాలు జారీ చేయాలని వినతి



హసన్‌పర్తి : మండలం భీమారంలోని సర్వే నంబర్ 340, 350లో దళితులకు కేటాయించిన భూములకు సంబంధించి పట్టాదార్‌పాస్ పుస్తకాలు జారీ చేయాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీకి స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత గ్రీవెన్స్‌లో సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. సర్వే నంబర్ 340, 350ల్లోని ప్రభుత్వ భూమిలో సుమారు నలభై ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 83 మంది దళితులకు ఒక్కొక్కరికి 20 గుంటల చొప్పున పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. 163 నంబర్ జాతీయ రహదారిలో 11 మంది భూములు కోల్పోగా వారికి పరిహారం కూడా ఇచ్చినట్లు చెప్పారు. మిగితా అర్హులకు ఇప్పటివరకు పట్టా పుస్తకాలు జారీ చేయలేదన్నారు. వెంటనే పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేయాలనికోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, రైతు బంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు విక్టర్‌బాబు, ఆలయ కమిటీ మాజీ ధర్మకర్త చిన్న, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

● భూపాలపల్లి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

శాయంపేట : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠాపన కోసం తిరుపతి నుంచి తెప్పించిన మూలవిరాట్ విగ్రహ మూర్తులకు పరకాల–హనుమకొండ ప్రధాన రహదారిలోని మాందారిపేట స్టేజీ వద్ద గండ్ర దంపతులు సోమవారం ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలో చేపట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠించేందుకు తిరుపతి నుంచి మూలవిరాట్ విగ్రహాలను తెప్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అర్చకులు వినుకొండ రాజ్‌కుమార్, మణికంఠ ప్రత్యేక పూజలు నిర్వహించి జలాభిషేకం చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకగా డప్పుచప్పుళ్లు, డీజే సౌండ్, మహిళల కోలాటాలతో ఆధ్యాత్మికత వాతావరణంలో శోభాయాత్రతో జిల్లా కేంద్రానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లతలక్ష్మారెడ్డి, ఎంపీటీసీలు బాసాని చంద్రప్రకాష్, గొట్టిముక్కుల స్వాతి విష్ణువర్ధన్‌రెడ్డి, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి నందం, నాయకులు దూదిపాల తిరుపతిరెడ్డి, దైనంపల్లి సుమన్, జిన్నా రాజేందర్, రేణికుంట్ల సదయ్య, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ మూర్తులకు స్వాగతం పలుకుతున్న గండ్ర దంపతులు



కోలాటం ఆడుతున్న గండ్ర జ్యోతి, మహిళలు

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి



జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : బీఆర్‌ఎస్ హయాంలోనే రాష్ట్రంలోని అన్ని పల్లెల్లో అభివృద్ధి జరుగుతోందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లతోపాటు కొత్తగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్నిచ మహిళా కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో పల్లెలు అభివృద్ధికి నోచుకోలేదని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టిందని తెలిపారు. కొత్తగా గ్రామ పంచాయతీలుగా ఉన్నతీకరించిందని, అనేక మౌలిక వసతులు కల్పించిందని వివరించారు. రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టడంతో పల్లెల రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్క సుమలత రజనీకర్, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు, సర్పంచ్ సావురే కమల రాజేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు ఎన్కతాల్ల రవీందర్, అంబటి రాజస్వామి, బొల్లోజు కుమారస్వామి, బొల్లెబోయిన రవియాదవ్, వేముల నవీన్, గుర్రం వేణు, వేల్పుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో బీఆర్‌ఎస్ విఫలం



మాట్లాడుతున్న డాక్టర్ విజయచందర్‌రెడ్డి

ఆత్మకూరు : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, నిరుద్యోగ యువతకు భృతి, దళితులకు భూపంపిణీ, ఉద్యోగ నియామకాల భర్తీ, తదితర అనేక హామీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదని స్పష్టం చేశారు. సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి బయ్య పైడి, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, ఆర్‌టీఐ కన్వీనర్ ఎదులాపురం శ్రావణ్‌కుమార్, నాయకులు శివప్రసాద్, వేణు, రేమిడి స్రవంతి మల్లారెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజు



కమలాపూర్ : ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని వంగపల్లి గ్రామానికి చెందిన అంకిల్ల రాజు నియమితులయ్యారు. ఈ మేరకు నిర్వహించిన ఆ పార్టీ జిల్లా సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ప్రకటించారు. రాజును జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో రాజు విలేకరులతో సోమవారం మాట్లాడారు. తనను నియమించిన వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృషకు, రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్‌కు, జాతీయ, రాష్ట్ర అధికార ప్రతినిధులు బొర్ర భిక్షపతి, బుర్రి సతీష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఉపేందర్, జిల్లా ఇన్‌చార్జీ అంబాల చంద్రమౌళిలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి, మాదిగ కులస్తుల అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

ఎమ్మెల్యే ధర్మారెడ్డిని ఓడించడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

నడికూడ : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ఓడించడమే లక్ష్యంగా పని చేస్తామని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత మొలుగురి భిక్షపతి తెలిపారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డికి ప్రజలు ఓటేసే అవకాశం లేదన్నారు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని చెప్పారు. రాబోయే ఎన్నికల అనంతరం రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆ పార్టీ నేత డాక్టర్ పగడాల కాళీప్రసాద్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ప్రజలు చిత్తుగా ఓడిస్తారని చెప్పారు. పార్టీ నిత్యం ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలతో పేదలను ఆదుకుంటోందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి, జయంత్‌లాల్, రాజవీరు, కోటి, సురేష్, మొగిలి, దయాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుదాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శంకర్

దామెర : మండలం కొత్తగా ఏర్పాటైన నేపథ్యంలో సమన్వయంతో పని చేసి అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుదామని ఎంపీపీ కాగితాల శంకర్ ఆకాంక్షించారు. ఆ దిశగా మండల ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శంకర్ మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులను కోరారు. జెడ్పీటీసీ గరిగె కల్పన కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చొరవ తీసుకుని మండలానికి అధిక నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. తొలుత ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ నివేదిక సమర్పిస్తుండగా దామెర సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి అడ్డుపడ్డారు. మండల కేంద్రంలో మిషన్ భగీరథ పథకం ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా నీటిని సరఫరా చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్గంపేట్‌లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాల్సి ఉందని సర్పంచ్ పురాణం రాజేశ్వరి తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి, ఎంపీడీఓ రవీందర్, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, ఎంపీటీసీలు గండు రాము, గోవిందు సంధ్య, సర్పంచ్‌లు వడ్డెపల్లి శ్రీనివాస్, తుత్తురు శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ గుర్రం రమేష్, ఎంఈఓ రమాదేవి, ఏపీఎం ఝాన్సీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, రాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సంగెం: వీఓఏలకు గౌరవ వేతనం పెంచిన క్రమంలో వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు సమ్మెట కృష్ణవేణి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శాంతి మండల సమాఖ్య కార్యాలయంలో సీఎం కేసీఆర్, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చిత్రపటానికి వీఓఏలు సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడారు. గతంలో రూ.3,900లుగా ఉన్న వేతనాన్ని రూ.7,900లకు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి కోడూరి రమేష్, కోశాధికారి జెండా వాణి, ఉపాధ్యక్షులు మేడి విజయ, కమిటీ సభ్యులు పాలకుర్తి విజయ్, రాము, సువర్ణ, ప్రభాకర్, లక్ష్మి, స్వరూప, రాధిక, రాజు, శారద, నారాయణమ్మ పాల్గొన్నారు.

‘స్వనిధి’ రుణాలను వినియోగించుకోండి

● మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి



మాట్లాడుతున్న కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి

పరకాల : వీధి వ్యాపారులు పీఎం స్వనిధి రుణాలను వినియోగించుకోవాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో పీఎంఎస్‌బీఐ, పీఎంఎస్‌జేవై, జన్‌ధన్ యోజన, శ్రమ్ యోజన, తదితర పథకాల అమలుపై సోమవారం నిర్వహించిన సమావేశానికి కమిషనర్ శేషాంజన్‌స్వామి అధ్యక్షత వహించి మాట్లాడారు. స్ట్రీట్ వెండర్స్ డెవలప్‌మెంట్ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం స్వనిధి పథకంలో భాగంగా పట్టణంలోని వీధి విక్రయదారుల కోసం పలు పథకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. వీధి విక్రయదారుల కోసం ఈనెల 4, 5, 6, 12 తేదీల్లో పీఎం స్వనిధి, స్త్రీ సమృద్ధి క్యాంపు నిర్వహించనున్నట్లు చెప్పారు. వీధి వ్యాపారస్తులందరూ మెప్మా ఆర్పీల ద్వారా ఆన్‌లైన్‌లో సోషియో ఎకనామిక్ ప్రొఫైలింగ్ సర్వే పూర్తి చేసుకుని వివిధ పథకాలను వినియోగించుకుని లబ్ధి పొందాలని సూచించారు. పీఎం స్వనిధి ఋణాలను ప్రతినెలా సకాలంలో చెల్లిస్తే సిబిల్ స్కోర్ 700లకు పడిపోకుండా తిరిగి రుణం తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఏడీఎంసీ టి.సతీష్, లేబర్ అధికారి రాజకుమారి, ఎస్‌బీఐ (ఏడీబీ) చీఫ్ మేనేజర్ సతీష్, పేటీఎం ఎగ్జిక్యూటివ్ శివ, మెప్మా ఆర్పీలు రుక్మిణి, అనురాధ, ఉమ, జయప్రద, సునీత, సాంబయ్య, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



సభ్యత్వాలతో శ్రీకాంత్, నాయకులు, విద్యార్థులు

పరకాల : ఐక్యపోరాటాలతోనే విద్యారంగంలోని సమస్యలు పరిష్కారమౌతాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై పాలకులు నిర్లక్ష్యం వీడాలని ఆయన హితవు పలికారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలతోపాటు ప్రైవేటు విద్యాసంస్థల్లో సోమవారం చేపట్టిన ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ రాణించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలపై పాలకులు అవలంబిస్తున్న తీరుపై అధ్యయనం చేసి చైతన్యవంతం కావాలని చెప్పారు. ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయలతో పాఠశాలల్లో, కళాశాలల్లో వసతులు కల్పిస్తున్నట్టు ఊదరగొడుతున్నా సమస్యలు యథాతథంగానే ఉంటున్నాయని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని భ్రష్టుపట్టించారని విమర్శించారు. పనికి రాని పనులతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంలో చూపుతున్న చొరవను విద్యారంగా సమస్యలపై చూపడం లేదన్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సంఘం క్రియాశీలకంగా పోరాడుతుందని తెలిపారు. విద్యార్థులు అధ్యయనంతోపాటు పోరాడడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

హసన్‌పర్తి : రెండో డివిజన్ పరిధిలోని గుండ్ల సింగారానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్టు తెలిపారు. శ్రేణులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కల్పన, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గనిపాక విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికం



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

దామెర : చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని జెడ్పీటీసీ గరిగె కల్పన కృష్ణమూర్తి తెలిపారు. జాతీయ పోషణ మాసాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కల్పన మాట్లాడారు. పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలను తీసుకుంటూ ఆరోగ్యాన్ని మెరుగు పర్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా పోషణ అభియాన్ మాసోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శంకర్, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి, ఎంపీడీఓ రవీందర్, విద్యుత్‌శాఖ ఏఈ గుర్రం రమేష్, ఏపీఎం ఝాన్సీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, జంగం రాణి, ఏపీఓ శారద, సర్పంచ్‌లు గురిజాల శ్రీరాంరెడ్డి, వడ్డెపల్లి శ్రీనివాస్, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

‘నారాయణ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి’

హన్మకొండ అర్బన్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నగరంలోని నక్కలగుట్టలోని నారాయణ కార్పొరేట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్‌జీకి గ్రీవెన్స్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రకాష్, తదితరులు

దామెర : నేత్రదానం చేసి అంధుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆప్తాల్మిక్ ఆఫీసర్ రేణుకుంట్ల ప్రకాష్ కోరారు. 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అన్ని దానాల్లోకి నేత్రదానం మిన్న అని చెప్పారు. సమాజంలోని ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని సూచించారు. ఒకరి నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చని తెలిపారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, డాక్టర్ సాహితి, హెచ్‌ఈఓ అశోక్‌బాబు, పీహెచ్‌ఎన్ లీల, సూపర్‌వైజర్లు శ్రీకాంత్, భాగ్యలక్ష్మీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

కేయూ క్యాంపస్ : ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో విస్తృతంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా తమలోని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కేయూ ఎన్‌ఈపీ సెల్ డైరెక్టర్, అడ్జెంట్ ఆచార్యులు పి.కృష్ణమాచార్య కోరారు. సోమవారం యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నూతన విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యలో విస్తృతంగా మార్పులు వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్యులు సదానందం, డాక్టర్ వీణ తదితరులు పాల్గొన్నారు.

గణిత శాస్త్ర గ్రంథం ఆవిష్కరణ

విద్యారణ్యపురి : హనుమకొండకు చెందిన డాక్టర్ అడ్లూరి నర్సింహమూర్తి పుస్తక రూపంలో తీసుకొచ్చిన తన డాక్టరేట్ సిద్ధాంత గ్రంథాన్ని పరిమళ కాలనీలో సిగ్నేచర్ ప్లేస్ అపార్ట్‌మెంటులో రిటైర్డ్ డీఈఓ డాక్టర్ వారణాసి వెంకట గురునాథశర్మ సోమవారం ఆవిష్కరించారు. ప్రముఖ విద్యావేత్త, పారిశ్రామికవేత్త డాక్టర్ గుజ్జారి శ్రీధర్‌బాబు ఆ గ్రంథాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా గురునాథశర్మ అధ్యక్షత వహించగా రామేశ్వరరాజు మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందిన అనంతరం సైతం పరిశోధన కొనసాగించిన నర్సింహమూర్తిని ప్రయోగశీలిగా అభివర్ణించారు. కార్యక్రమంలో రిటైర్డ్ వృత్తి విద్యాధికారి పరాంకుశం, ఎలక్ట్రిసిటీ ఇంజనీర్ గుమ్మడవెల్లి పురుషోత్తమ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ యల్లంబట్ల నాగయ్య, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ తూపురాణి సీతారాం, డాక్టర్ సనత్‌కుమార్ పాల్గొన్నారు.

నకిలీ పత్రాలు సమర్పించే వారిపై చర్యలు తీసుకోవాలి

విద్యారణ్యపురి : బదిలీ, ఉద్యోగోన్నతుల కోసం నకిలీ పత్రాలు సమర్పించే వారిపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డీఈఓ అబ్దుల్‌హైకి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సోమశేఖర్ మాట్లాడారు. జిల్లాలో బదిలీలు, ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని కోరారు. కొందరు నకిలీ ధ్రువపత్రాలను సమర్పిస్తున్నట్టు తెలిపారు. సీనియారిటీ జాబితాల్లో పొరపాట్లు లేకుండా చూడాలని సూచించారు. మెడికల్ బోర్డు, సదరం సర్టిఫికెట్లు క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సదాశివరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ పెండెం రాజు, జిల్లా కార్యదర్శి సీఎస్ఆర్. మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.